

# ముష్టి

దే. సావిత్రి

"ఏమే - నిన్నే, వినపడ్డంలేదు! వాడు అలా అరుస్తుంటే - కాస్త ముష్టివేసి పొమ్మన్న కూడదూ??"

"తెల్లారినదా నాయనా. ముష్టికి! దుక్కలాగ ఉన్నావు. ముష్టెత్తకపోతే-పనిచేసి ఏడవ కూడదూ? రేషను కాలములో ముష్టి! మాకే లేదు తినడానికి, అనే మాటలు ప్రతియింటా వింటున్నవే.

ఈముష్టినే కొందరు "యాచన" అంటారు. "యాచన" దబాయింపుగా ఉంటుంది. ముష్టి నీరసంగా జాలిగా ఉంటుంది.

నన్నడిగితే రెండూ ఒకటే. కాని నేటి సంఘములో నూ ముష్టే రకరకాలుగా వెలుగుతోంది బీదలు బీదగానూ పెద్దలు పెద్దగానూ, పిన్నలు పిన్నగానూ నాగరికులు నాగరికతగానూ చేసే ప్రతి కార్యమూ ముష్టే. బాగా ఆలోచిస్తే బ్రతుకే ముష్టి. ముష్టికోసరమే బ్రతకడము. రెండూ కలిపి బ్రతుకే ముష్టిఐ కూర్చుంది.

చూడండి. మనము ముష్టివేస్తూనే ముష్టెత్తుతాము. ఎలాంటి వాడినైనా సరే... పదవిలో ఉంటే గౌరవిస్తాము. డబ్బుంటే లక్ష్మీ పుత్రుడని "తందాన తానా" పాడ్తాము. అంచేత "ముష్టి" అనే మాటను గౌరవంగా కాపాడాలి. తెల్లవారితే అందరు ఎత్తేది ముష్టే: పరమేశ్వరుడుకూడా ముష్టెత్తుతూనే భక్తులను రక్షించేవాడు.

ముష్టికి హెచ్చు తక్కువలు లేవు. ప్రాపకముల ప్రాధేయము లేదు. ఏకులమైనా కాతరీ లేదు. బుర్రలో తెలివి ఉంటే 'ఏదేశ మేగినా ఎందుకాలిడినా ...' చిటికెలో చలామణీయై జండా ఎత్తి హాయిగా ఉండొచ్చును. నీవు బ్రతుకే ముష్టి అన్నావు, ముష్టెత్తుతూనే ముష్టి వేస్తాము అన్నావు? అని మీరు నన్నడగవచ్చును.

అంబా పల్కు, జగదంబా పల్కు. మనే బుడ బుక్కలవాని మాటలో ముష్టికోసం ముష్టికి తయారౌతుంది. "అయ్యగారికి ప్రమోషన్ అవుతుంది. ఉత్తరాదినుంచి జాబు వస్తావుంది. ఇంట్లో శుభము, లచ్చి వస్తాది. అంబ పల్కుంది" అంటాడు. అంబ పల్కిన ఫలము నాశించో లేక పొద్దుటే శనిలాగ వచ్చాడు, నిద్ర పోతోందనో కానీయో అర్థణావో వెయ్యపోతే చివరికి అయ్యగారి చొక్కా, అమ్మగారి రవికా పుచ్చుకుంటేనే కాని వదలడు.

డబ్బిచ్చి పాలుకొంటూ, "ఏదీ సరిగ్గా పొయ్యి. అంతా నురగే కొంచెము జారనియ్. ఊరికే పోస్తున్నావా! డబ్బివ్వలే?" అంటూనే ముష్టిగా పాలు కొసరుతాము. ఇలాంటివి డబ్బిచ్చి అడిగే ముష్టి. కూరగాయల వానిదగ్గర తూకంలోనూ, పండ్లవాని దగ్గర పళ్ళు కొంటూ ఒకటి పైన వెయ్యి అంటూనూ, ఆఖరికి అణా కాని ముగ్గు, రెండణాల చీపురు దగ్గర కూడా ముష్టి ఎత్తుతూన్నాము.

తెల్లగా రాగిచెంబు తోమి, దాన్ని అలంకరించి, నాలుగిళ్ళ ముష్టితో తిరుపతి వెళ్లుతాము. మీకు తోచినది వెయ్యండి. దేముడి మ్రొక్కు అంటూ దేముని పేర ముష్టి.

గొప్పవారిని టీపార్టీలకు, పిలిచి తిన్నది అరిగేలోపున వెళ్ళి, మావాడికి వీలైతే ఓ చిన్న ఉద్యోగము వేసేద్దురూ, ఫలానా ఊరు

బడిలీ అయ్యేలాగ చూద్దురూ! మీ మేలు మరువం. అనడం ఒక రకము.

రాత్రి సెంట్రల్ స్టేషన్‌లో పెట్టె, పరుపూ పోయాయి. కట్టుబట్టలతో ఉన్నాను. మీరైన సహాయము చేయండి అని ప్రాధేయపడుట మరొక రకము!

బజార్లో పోతూ ముక్కు మొగము తెలియక పోయినా ఆపు చేసి, చిటికెడు పొడుము ఇవ్వమనడం, హల్లో బ్రదర్ ఎప్పుడు రాక అంటూ లైసు చూసి కడుపు మాడుతోంది అందులో దూర్దాము అంటూ కాఫీ హోటల్లో బాగా మెక్కి బిల్లు నేను యిస్తారా అంటూ యివ్వక పోవడం!

ఓరేయి సూటు, బుర్ర వేలాడేసుకు పోతున్నావే. సిగరెట్టు లేదా ఏమిటి జేబులో, ఇదిగో! తీసుకో అనడం. ఎవరేనా ఆఫర్ చేస్తే పీలుస్తాం కాని డబ్బు పెట్టి కొనేటంతటి ఫూల్సు కాన్రా అనడం!

ఇవాళ మంచి పిక్చర్రా. నా పర్సు మర్చిపోయి వచ్చాను, ఆఖరు రోజూ అంటూ వాడికి రుద్దడం.

బస్సుల్లోనూ, ట్రాముల్లోనూ ఇద్దరు కలిసి బయలుదేరి కండక్టరు వచ్చేదాకా ఊరుకొని, అప్పుడు జేబులు తడుముకొంటూ జిడ్డు అంతా ఒకడికే కట్టించడం!

ఇవి అన్ని చాలా నాజూకుగా తయారైన ముష్టి ఇవిగాక ఇంకా గొప్పరకము ... మా అబ్బాయి పెళ్ళి, అమ్మాయి పుట్టిన రోజు, నాన్న గారి షష్టిపూర్తి, గృహప్రవేశము అని పిలిచి మస్తుగా భోజనాలు పెట్టి, తాంబూలాదు లిచ్చి వారిచ్చిన కానుకలు అందుకుంటూ- ఇందుకా పిలిచాము? ఇవన్నీ ఎందుకండీ, మంచివారే! నాకు అప్పుడే తెలుసు మీసంగతి. ఊరికే రారని, అంటూ కానుకలు ఏమీ తీసుకురానివాళ్ళను... మర్యాద తెలియదు, అంత డబ్బుంది, కట్టుకు పోతారా? అనడం! అయితే యీ ముష్టి ఆనందాన్ని, తృప్తినీ కలిగించే ముష్టి.

ఇంక ఎలక్షనులలో నిలబడే ప్రతి వ్యక్తీ ఇంటింటికీ వెళ్ళి మీరు ఓట్లు ముష్టివేస్తే, తరువాత నేను మీకు యథాశక్తి ముష్టి పెడ్తాను! ఈ శాఖలో చేరిన వారంతా కార్లమీద డబ్బుంచుకుని తిరిగే "గౌరవనీయులు" ఐన ముష్టివాళ్ళు.

అందుచే మనిషికన్న ముందు పుట్టినది ముష్టి. మనిషితో పాటే పెరుగుతోంది ముష్టి. మనిషి చేసే ప్రతిపనిలోనూ ప్రతి మాటలోనూ కలిసుంది ముష్టి. భగవంతుడు ముల్లోకాల్లో ఉన్నాడో లేడో కాని, లోకాలన్నింటిలో వ్యాపించి ఉంది ముష్టి.

భార్యాభర్తల్లోనూ, అన్నదమ్ముల్లోనూ, ఎదురింట్లోనూ, పక్కింట్లోనూ, వీధుల్లోనూ, బజార్లల్లోనూ, ఆఫీసుల్లోనూ, మీటింగుల్లోనూ, సినిమాల్లోనూ, ఇంట్లా బయటా - అట్టే మాట్లాడితే రాత్రింబగళ్ళలోనూ, అంతా ముష్టిమయమే. ఇన్ని రకాలుగా వ్యాపించి ఉన్న ముష్టిని మన్నించాలని నా కోరిక. గవర్నమెంటువారు ముష్టికి ఓ కోర్సు పెట్టి, బాగా ముష్టెత్తిన వారికి డిగ్రీలిచ్చి, సంఘములో వారికి ఉన్నత స్థానము, ఒక గణ్యతా పడవెయ్యాలని నా ఆశ.

దంపతుల తొలిప్రేమఫలంగా కూతురు పుట్టింది. ఏం పేరు పెట్టడమా అన్న సమస్య తేలలేదు. "జానకి అని పెడదాం, మా అమ్మ పేరు" అంది భార్య.

"తప్పకుండా. ఆ పేరంటే నాకెంతో యిష్టం. నేను కాలేజీలో చదువుతున్న రోజుల్లో మా క్లాసులో జానకి అని ఓ అమ్మాయి ఉండేది. నాతో ఎంతో చనువుగా స్నేహంగా ఉండేది. మేమిద్దరం కలిసి వెళ్ళిన సినిమాలు, బీచి షికార్లు ఎప్పటికీ మరచిపోలేను. నిజం, మన పాపకి జానకి అన్న పేరే ఖాయం" అన్నాడు భర్త.

క్షణమాత్రం బొమలు చిట్లించి భార్య అంది: "ఒద్దులెండి. అదేమంత అచ్చివచ్చిన పేరు కాదు. మీ అమ్మగారి పేరు పెడదాం-వెంకటలక్ష్మి అని."